ఎదురింటి గడియారం ఏడుగంటలు కొట్టింది ముసురుకుంటున్న చీకట్లలో బావిదగ్గర అప్పుడే ఆఫీసు నుండి వచ్చి చల్లని నీటితో ముఖం కడుకుంటున్న నీరజతో గిరిజ అంది.

"జయం అవుతుందక్కా" అని.

"ఏమిటే" అంది నీరజ తువ్వాలందుకుంటూ.

'ఈసారైనా ఈ సంబంధం మా అక్కకు స్థిరపరచు దేవుడా?' అని నేను మొక్కుకుంటూవుంటే గడియారం గంటలు కొట్టింది. అందుకే నీకీ సంబంధం కుదురుతుందని అంటున్నాను" అంది గిరిజ.

"నా కేమీ అర్థం కావటంలేదు. ఏ సంబంధం" బొడ్లో దోపుకున్న చీర కుచ్చిళ్లను దింపుకుంటూ అడిగింది నీరజ.

"ఏవమ్మా! అంత ఆత్రుత? అమ్మ చెపుతుందిలే. నాకేం తెలియదు" అంది గిరిజ.

"ఆత్రుతా లేదు, ఆనందమూ లేదు గిరిజా. ప్రసంగాన్ని నీవే తెచ్చావు. చెప్తే చెప్పు లేకపోతే లేదు" అంది నీరజ యింటివైపు కదలబోతూ.

"అంతేగాని బతిమిలాడవుగా!" ముందుకు కదులుతున్న నీరజ చెయ్యి పట్టుకుని ఆమె ముఖంలోకి చూస్తూ అంది గిరిజ.

"ఏమంత ఆనందకరమైన విషయమని బ్రతిమలాడి చెప్పించుకోవాలె గిరిజా! వస్తాడు. వస్తాడని మనం ఎదురుచూస్తాం. ఆ పెళ్ళికొడుకు రానే వస్తాడు. ఎంతో ఆట్టహాసం చేస్తాం. చూస్తాడు. ఐదువేలకు తగ్గకుండ కట్నం అడుగుతాడు. మన మెలాగూ యివ్వలేము. నచ్చలేదని వెళ్లిపోతాడు. ఇంతేగా జరుగుతుంది. ఇంతకన్న ఇంకేం జరుగుతుంది? క్రొత్త కథేమి కాదుగా" జామచెట్టు క్రింద వున్న నులకమంచంమీద నెమ్మదిగా కూలబడుతూ.

"ఈ కథ క్రొత్తదే అక్కా! సరిక్రొత్త కథ."

"ఏమిటో ఆ కొత్తదనం?"

"పెళ్ళికొడుకు ఈసారి నిన్ను వెతుక్కుంటూ వచ్చాడక్కా!"

"ఎగతాళి చేయటానికి నేను తప్ప నీకెవరూ దొరకలేదా గిరిజా!"

"తాళి కట్టించుకునే వేళయిందంటె ఎగతాళి అంటావేవమ్మా! ఇంతకీ అతనెవరో తెలుసా? మనఊరే. మనవీధే"

"మన వీధిలో పెళ్లికొడుకెవరబ్బా!"

"చంద్రంగారక్కా!"

"ఏ చంద్రంగారు గిరిజా!"

"మన వీధి చివర డాబా యింట్లో ఉండటంలేదూ! ఆయనే."

"అతనా?"

"ఏవమ్మా అంత తేలిగ్గా అనేశావు?"

"అతని పెళ్లాంపోయి సంవత్సరమే కదా

రాజీమార్గం

ఊర్వశి

అయింది. అతనికొక కూతురుకూడా కదా! అతనప్పుడే పెళ్లికి సిద్ధపడ్డాడా?"

"సిద్ధపడకపోతే ఆ పసికందు నెవరు చూస్తారక్కా! అతనికి తల్లి తండ్రీ లేరు. అన్నలు. అక్కలు, వదినలు ఎంతమందిఉన్నా ఎవరుమాత్రం పసికందు నెంతకాలం సాకుతారు? మరి పెళ్లి చేసుకోకపోతే. ఎలా?' అడిగింది గిరిజ.

"పాపం అతనిమీద ఎంత జాలే నీకు?"

"నీకుమాత్రం జాలిలేదా? నిన్ను ఈ పెళ్ళికి ఒప్పించమని నీవు ఆఫీసుకు వెళ్ళిపోయిన తరువాత అతని తరఫునవాళ్ళు ఎంతమంది వచ్చారో తెలుసునా? ఇద్దరక్కలు, ఇద్దరు వదినలు–ఇంకా మావయ్యలో ఎవరో చాలమంది అమ్మకు ఎంతెంతో చెప్పవెళ్ళారు. నీవతనికి నచ్చావట. కట్నం అక్కరలేదట."

"కట్నం అక్కరలేదన్నాడనేగా మీ కందరికీ ఈ సంబంధం నచ్చింది?"

"కట్నంకోరితే మంచిసంబంధం అయ్యేదా? కట్నం అడిగితేమాత్రం అతనికి భార్య దొరకదా? ఇంతకూ అతనికేమితక్కువ? నిండా ముప్పయిఏళ్ళుకూడలేవు. అనాకారి కాడు. ఉద్యోగం లేనివాడుకాడు. మరి ఎందుకమ్మా! అంత నిర్లిప్తత?" అడిగింది గిరిజ.

సమాధానం రాయకుండ మంచంమీద నుండి లేచి వెళ్ళిపో ఉద్యుక్తురాలయింది నీరజ

"ఏమక్కా మాట్లాడవు ? నీకీ పెళ్ళి యిష్టంలేదా ?" చెయ్యిపట్టుకుని అడిగింది గిరిజ

"నన్నేమీ అడగకు గిరిజా ! నన్ను వెళ్ళనియ్యి" అంటూ యింటిలోకి సాగిపోయింది నీరజ, గిరిజ నెమ్మదిగా ఆమెననుసరించింది.

కాఫీ అందిస్తున్న తల్లి ఏదో చెప్పబోతూండగా నీరజనేమీ మాటాడించవద్దని గిరిజ తల్లికి సైగచేసింది. కాఫీ తాగేసి తల ఎత్తకుండ జామిచెట్టు క్రిందికి వెళ్ళిపోయింది నీరజ.

"ఏం జరిగింది ?" నెమ్మదిగా అడిగింది శాంతమ్మ.

"ఏంలేదమ్మా ఇప్పుడే ఆఫీసునుండి వచ్చింది కదా ! అలసిపోయిఉంది అంతే" అంటూ వెళ్ళిపోయింది గిరిజ

భోజనం దగ్గరకూడ ఎవరితో మాటాడక ఎవరూ మాటాడటానికి అవకాశం ఈయక భోజనంచేసి వెళ్ళిపోయింది నీరజ.

వంటింటిలో పని ముగించుకుని నెమ్మదిగా గదిలోకి వెళ్ళింది గిరిజ. కిటికీదగ్గర కూర్చుని చీకటిలోకి చూస్తున్న నీరజ ప్రక్కనే చేరి "ఏమాలోచిస్తున్నావక్కా !" అడిగింది గిరిజ తుళ్ళిపడింది నీరజ.

"రెండో పెళ్ళివాడనా ?" అడిగింది గిరిజ

"కాదు గిరిజా !" సమాధానమిచ్చింది నీరజ.

"అదికాక మరేమిటి ? ఇందాకటినుంచి విర్లిప్తంగా ఉన్నావు ?"

"ఏం లేదు గిరిజా ! నన్నిలా ఉండనియ్యి"

"అక్కా ! నీకీపెళ్ళి యిష్టంలేదుకదూ!" గిరిజ వదలిపెట్టలేదు.

"ఈపెళ్ళే అని ఏముంది గిరిజా ! నాకు పెళ్ళంటేనే యిష్టంలేదు"

"ఎందుకిలా మాటాడుతున్నావు ? నీకేం వయసు దాటిపోయిందని ?"

"అనేమికాదమ్మా గిరిజా ! నేను పెళ్ళి చేసికుని వెళ్ళిపోతే ఈయిల్లు ఎలా నడుస్తుంది ? తమ్ముడి చదువు పచ్చేయేటికి గాని పూర్తికాదు. అప్పటికీ ఉద్యోగం వస్తుందన్న నమ్మకమేమిటి ? అన్నయ్య గాడ్యుయేటుఅయి రెండుసంవత్సరాలయినా ఉద్యోగం లేదుగా నీచదువు పార్వతి చదువు ఇంకా మొదటిలోనే ఉన్నాయి. నాన్న పెన్షన్, బట్టలకొట్టు వాళ్ళిచ్చేది కలిపితే నూట ముప్ఫయ్యేకదా. మరి సంసారం ఎలానడుస్తుంది?"

"ఇంటి పరిస్థితి చూచేనా నీవు పెళ్ళికి విముఖంగా ఉన్నావు? ఈ బాధలు ఈనాటితో తీరవు అక్కా ! నీవు అదృష్టవంతురాలవు కాబట్టి నీకీ సంబంధమైనా వచ్చింది. వచ్చిన అదృష్టాన్ని వదులుకోకు అక్కా ! పెళ్ళి చేసికొని వెళ్ళిపో. మాకాపాటి అదృష్టం కూడ ఉండదు."

"బెంగపడకు గిరిజా! నీదారికి నేను అడ్డురాను, మీకు పెళ్ళిళ్ళుచేసే పూచీ నాది."

"మరి నీ పెళ్ళి'

"నేను పెళ్ళిచేసికోను గిరిజా !"

"ఎంతదారుణంగా మాటాడుతున్నావక్కా ! నీవు పెళ్ళిచేసికోకపోతే నేనుమాత్రం చేసికుంటానా ? నీవు పెళ్ళిచేసికొని వెళ్ళిపోతె అన్నయ్య ఏ ఆర్భాటాలకూ పోక ఏచిన్న ఉద్యోగంలోనైనా చేరతాడు. కుటుంబాన్ని పోషించే పద్ధతులు వెతుకుతాడు. నీవీయింట ఉన్నంత కాలం యింతే. అన్నయ్య ఆఫీసరు ఉద్యోగాలనే కలలుకంటూ ఉంటాడు"

"పెళ్ళి విషయమై నన్ను బలవంతం చెయ్యకు గిరిజా !

"పెళ్ళంటే సుముఖంగా ఉండని ఏ స్త్రీ ఉండదు అక్కా ! కాని నీవు పెళ్ళివద్దనటం పూర్తి విముఖతగా నే ననుకోను. నీవు తప్పించుకోటానికీ మాటలు అంటున్నావు నీ మనసులో ఏదోఉంది. నాకు చెప్పవూ."

నీరజ మాటాడలేదు.

"మాటాడవేం అక్కా? నీ మనసులో ఎవరైనా ఉన్నారా?"

"గిరిజా!" పట్టుపడిన దానిలా చూచింది నీరజ.

"ఎవరక్కా! నాతో చెప్పవూ?"

"చెప్తాను గిరిజా! కాని...ఏదీ నీ చెయ్యి ఇలా యియ్యి. నే చెప్పేది ఎవరికీ చెప్పనని మాటియ్యి."

గిరిజ చేతి నిచ్చింది.

"నే చెప్పేది ఎవరితోనూ చెప్పకూడదు. మనసులోనే దాచుకోవాలి మాటేనా?"

"మాటే" అంది గిరిజ నీరజ చేతిని గట్టిగా నొక్కుతూ.

"ప్రకాశరావుగారు నన్ను పెళ్ళి చేసికుంటానని మాటిచ్చారు గిరిజా! అతను నాకు మంచి స్నేహితుడు. నేనూ అతన్ని యిష్టపడ్డాను. మా పెళ్ళి జరిగితీరుతుంది. కాని కుటుంబ పరిస్థితులవల్ల ఒక సంవత్సరం వరకూ మా పెళ్ళి జరగదు అతని తమ్ముడి చదువు వచ్చేయేటికిగాని పూర్తికాదు. అంతవరకూ వాయిదా వేయక తప్పదు. చందంగారు మంచివారే నాకు తెలుసు. కాని మనసుకాని మనువు అది గిరిజా ఈ పెళ్ళి ఎలాగైనా తప్పించు" గిరిజ చేతిని గట్టిగా నొక్కి అంది.

"ఈమాట నీవు అమ్మతో చెప్పవచ్చుగా"

"చెప్పవచ్చు. కాని ఒకఅభ్యంతరం. అతనిది మన కులం కాదు. అతను మాత్రం నాకు మంచి స్నేహితుడు నన్ను బాగా అర్థం చేసికున్నాడు...గిరిజా నీకిలా వాడి వాడిగ చెప్తే అర్థం కాదు. వివరంగానే చెప్తాను విను. నేనిప్పటి కప్పుడే ఉద్యోగంచేస్తూ ఆరు సంవత్సరాలు దాటతోంది ఈ ఆరు సంవత్సరాలలో ఎన్ని బాధలు పడ్డానో ఎన్ని అవమానాలు సహించానో మీకు తెలియదు. నేను కూడ మీకెవరికీ చెప్పలేదు. కారణం చెప్పినా ప్రయోజనం లేదు కనుక మీ అందరిదృష్టిలో నేనొక కల్పతరువుని. సంపాదించేయంత్రాన్ని

రాలిన ముత్యాలు

......శ్రీ సోమసుందర్ ...

ఇంత మంది రాజకీయ దురంధరులు
ఒక్కసారిగా కనిపించే సరికి
చాటంతయింది ముసలి బిచ్చగాడి మొగం
అరిగిన చెప్పులూ దళసరి కళ్ళద్దాలూ
కర్రావాడూ అర్ధనగ్నంగా
అసహ్యంగా ఉన్నాడు
నిటారుగా నిలవలేకపోతూ
అర్థిస్తున్నాడు
"మీ జేబుల్లో కాస్తంత
త్యాగం ఉందేమో
బిచ్చం పెట్టండి బాబులూ !"
'వెళ్ళు వెళ్ళు అదింకా
మాదగ్గ రెక్కడుంది
ఇప్పుడే రాజఘాట్‌లో
సమర్పించి వచ్చాం, పో !'
బిచ్చగాడు నిస్పృహ వహించున్నాడు
మొహం చెల్లక !
తానిప్పుడెక్కడ్నించొచ్చేనో
ఎలా చెప్పగలడు పాపం !

మీ అందరికోసం నేను యంత్రంగానే మారక తప్పలేదు. ఆఫీసుకు నడచి వెళ్ళేదాన్ని, నడచి వచ్చేదాన్ని. లంచ్ టైములో టీ నీళ్ళకుతప్ప మరెందుకు నేను నోచుకోలేదు. సుమారుగా నా జీతాన్నంతా నాన్న చేతిలో పోశాను. కాని మీలో ఏ ఒక్కరూ కూడ నా కష్టసుఖాలను పరామర్శించలేదు కాని ఎవ్వరైనా కనిపించి లాలింపుగా పలుకరిస్తే అంతా చెప్పుకుని ఏడ్వాలని నా కుండేది ఉద్యోగం చేసి సంపాదించుకునే ఆడది ఎంతో సుఖపడుతుందని మీరంతా అనుకుంటారేమో కానేకాదు. నలుగురు మగవాళ్ళమధ్యన పనిచేసే ఆడదాన్ని అవహేళన చేయటం, అవమానించటం, అందితే అనుభవించి విడిచిపెట్టటంతప్ప ఈ మగవాళ్ళకేదీ చేతకాదు అందరూ అలా ఉంటారని కాదు కాని నూటికి తొంభయిమంది అంతే. ఇంటా బయటా సానుభూతి లేనప్పుడు బతికి ఎందుకు? చావాలనిపించేది కాని చస్తే మీరంతా ఏడుస్తారు యిల్లెలా గడుస్తుందని. 'ఏదో చేయరానిపని చేసింది. అందుకే చచ్చింది' అని లోకం నిందను అంటకడుతుంది. డాక్టర్లు శవాన్ని కత్తులతో కోస్తారు ఏతప్పూ చేయకపోయినా నిందను మోసికొని పోవాలికదా అనే భయపడ్డాను. అందుకే చావలేదు. కాని మానసికంగా క్షణక్షణం చచ్చిపోతూవుంటే సుమారు రెండు సంవత్సరాల క్రితం ప్రకాశరావుగారు ట్రాన్స్‌ఫర్‌మీద మా ఆఫీసుకు వచ్చారు చూచిన మొదటి రోజుననే నాకతని మీద సదభిప్రాయం కలిగింది అతను అందరిలా ఒళ్ళు దాచుకునే మనిషికాడు ఇతరులను మెప్పించాలని చూచే రకమూకాదు ఆడవాళ్ళ గురించి తేలికగా మాటాడే శాస్త్రికి గట్టిగా బుద్ధి చెప్పాడు. నన్ను అవమానం చేదామనుకున్న శివయ్య కంటవెంట నీరు తెప్పించాడు అతని రాకతో మా పదిమంది స్టాఫ్‌లోనూ మార్పు వచ్చింది "అందరం ఉద్యోగంకోసం వచ్చిన వారమే అందరికీ కష్టాలు ఇబ్బందులు ఉన్నాయి ఒకరి కష్టాలను మరొకరు సానుభూతితో విని ఆదుకుంటూ పోవటమే మన ధర్మం. అప్పుడు ఎన్ని కష్టాలయినా కష్టాలనిపించవు." అని అందరి మనసులకు హత్తుకునేటట్టు చెప్పాడు అతను ఆఫీసులో పని చేస్తున్నంత కాలము ఎవరూ ఏమీ చేయలేరు అన్న ధైర్యం నాకు కలిగింది ఎప్పుడైనా పని ఎక్కువగా ఉంటే 'నీరజగారూ, మీరింటికి

రాజీనామా

వెళ్ళండి. చీకటి పడుతోంది. నవీ పేపర్సు టైప్‌చేసి మేనేజర్‌గారికి ఒప్పచెప్తాలెండి" అని నన్ను యింటికి పంపించేవారు ఇలా నాకే కాదు ఎవరు పనితో సతమతమవుతున్నా తాను చేయగల సహాయాన్ని చేసేవారు. అందుకే అతనంటే అందరికీ యిష్టం. ఒక రోజున నేను అరగంట ఆలస్యంగా ఆఫీసు కెళ్ళాను. ఎప్పుడో తెలుసా! నీవూ అమ్మ ఇంటిలోకి రానప్పుడు ఆ రోజు మీ అందరికీ వండి పెట్టి వెళ్ళేసరికి ఆలస్యమయింది. అలా ఆలస్యంగా వెళ్ళటం అదే మొదటిసారి కాదు. వరసగా మూడోరోజది. ఆరోజు మరీ ఆలస్యమయింది. అందుచేత ఆఫీసర్‌చేత చీవాట్లు తినవలసి వచ్చింది. నాకు కన్నీళ్ళాగలేదు.

ఇవతలికివచ్చి సెలవుచీటిరాసి ఆఫీసర్ గదిలోకి వెళ్ళబోతూంటే ప్రకాశరావుగారు అడ్డుపడి నా చేతిలోనున్న కాగితాన్ని లాక్కుని "మీ సీటుకెళ్ళి మీపని చేసుకోండి" అని చెప్పి తను ఆఫీసర్‌గారి గదిలోకి వెళ్ళిపోయారు. మరి అతను ఏమి చెప్పారో తెలియదు. ఆ రోజు ప్రతిరోజులాగే మామూలుగానే గడిచింది ఆ రోజున ఆఫీసునుండి వచ్చేస్తుంటే ప్రకాశరావుగారు నాతోకూడా వస్తూ.

"మీరిలా ప్రతిరోజు లేటుగా వస్తే ఎలా? కొద్దిగ త్వరగా పనులు ముగించుకుని బయలుదేరాలి. ఇవ్వాళ మొదటిసారైంది కాబట్టి అడ్డుపడ్డాను. మరో రోజున అడ్డురాను" అన్నారు.

"ఇవ్వాళ మాత్రం అడ్డుపడమని మిమ్మల్నెవరడిగారు?" అన్నాను. అతను నా ముఖంవైపు ఒకసారి చూచి నెమ్మదిగా "ఎందుకో మీకు తెలియదా?" అడిగారు.

"ఎందుకు?" అడిగాను,

"మీరు స్నేహితులు కాబట్టి, మీ అమాయకత్వం, ఎవరినీ ఎదిరించలేని అసహాయతను చూచి అడ్డుపడ్డాను. ఆలస్యమవుతుందన్న రోజునైనా ఆఫీసుకు రిక్షా ఎక్కైనా రావాలి. అలా చేయకపోతే ఇవ్వాళ జరిగినట్టే జరుగుతుంది. మీ ఖర్చుకోసమైన కొద్దిగ పాకెట్‌మనీ మీ పర్సులో ఉంచుకోండి" అని సలహా యిచ్చాడు.

మేము నడుచుకుని మాటాడుకుంటూ వస్తున్నాము. అప్పటికే చీకటి పడింది.

"జీతమంతా ఇంటిలో యిచ్చేయటం కాదు. మీ ఖర్చుకోసం కొంతయినా ఉంచుకోండి మేడమ్" అన్నాడు.

"జీతమంతా యింటికే యిచ్చేస్తానని మీ కెవరు చెప్పారు?" అడిగాను.

"ఒకళ్ళు చెప్తేగాని తెలియని విషయమా?" నా గురించి ఎంతో తెలిసినట్టు అతను ఆప్తుడిగా మాటాడుతూంటే ఎంతో ఆనందం కలిగింది. అతను మన యింటి గురించి అడుగుతూంటే అతనినుండి ఏదీ దాచాలనిపించలేదు. నేను చెప్పినదంతా అతను విన్నారు. "ఇంటింట ఇదే కథ" అంటూ తన గురించి చెప్పారు. వింటుంటే అంతటి బరువును మోస్తూ ఏ బాధా లేనివాడిలా అతనెలా నవ్వగలుగుతున్నాడా అని ఆశ్చర్యపోయాను.

"మా తమ్ముడి చదువైపోతే చాలు నా బాధ్యతలు చాల తగ్గినట్టే. ఇంక సుమారు రెండు సంవత్సరాల కాలం" అన్నారతను. ఆ నాటినుండి మేము మంచి స్నేహితులమయ్యాము. అతను నాకు ఆప్తుడు, ఆత్మీయుడు అయినారు. మనసుకు చాలా సన్నిహితంగా వచ్చేశారు. ఒకరోజున ఆయనే అన్నారు. 'మీరు యిష్టపడితే మిమ్మల్ని నేను పెళ్ళి చేసుకుంటాన'ని కాని ఒక సంవత్సరం ఆగవలసి ఉంటుందని చెప్పారు. నే నంగీకరించాను. నా అంగీకారాన్ని తీసుకునే అతను తనకు దగ్గరైన సంబంధాన్ని కూడ కాదన్నారు. ఆ అమ్మాయికి పెళ్ళి అయిపోయింది. ఈ పరిస్థితిలో నా స్వార్థం నేను చూచుకొని

పెళ్ళి చేసికొని అతన్ని కాదనటం న్యాయమా? చెప్పు?'' అడిగింది నీరజ.

''న్యాయాన్యాయాలు చెప్పటానికి నేనె వర్తినక్కా? అమ్మా నాన్నకు తెలియకుండ నీవు ఎవరికో మాట యివ్వటం న్యాయమంటావా? కులము గోత్రము సరిపడని వివాహానికి నీవు సిద్ధపడటం సబబు అనే అంటావా అక్కా!''

''గిరిజా!''

''అవునక్కా! నేనే అంటున్నాను నీగురించే నీవాలోచించుకున్నావు గాని మా గురించి నీవేమైనా ఆలోచించేవా? ఆలోచించిన దానవైతే ఇలాంటి నిర్ణయం చేస్తావా? అన్నీ సవ్యంగా ఉంటేనే ఆడపిల్లలకు పెళ్ళిళ్ళు సమస్యలుగా ఉన్న ఈ కాలంలో నీకేగాని ప్రకాశరావుగారితో పెళ్ళయితే రేపు మా సంగతి ఏమిటి? నీవు తప్పుచేసి సంఘంలో మమ్మల్ని పెళ్ళి చేసికోటానికి సంస్కారులు, సహృదయులు లేరని సంఘాన్ని నిందిస్తే ఏమిటి ప్రయోజనం?''

''గిరిజా నాకు పిచ్చి ఎత్తించకు!''

''పిచ్చిదానవు కాకముందే జాగ్రత్తపడు.''

''గిరిజా! ముందేచెప్పానమ్మా! మీ పెళ్ళిళ్ళు నే చేయిస్తానని. మీ దారులకు నే నడ్డురానని. నా పెళ్ళి అవుతుంది మీ పెళ్ళిళ్ళ తరువాతేలే. అప్పుడు నా వలన మీ కెవ్వరికీ దిక్కుతోచని గతి పట్టదు. నాకోస మతను ఎంతకాలమైనా ఉంటారు.''

''అక్కా! నీ ఆలోచనలు సరిగా సాగటం లేదు నీకేదో పిచ్చిపట్టింది'' అంటూ గిరిజ అక్కడనుండి లేచి వెళ్ళిపోయింది.

నీరజ తలదిమ్మెక్కిపోయింది ఆకాశంలో చుక్కలనే చూస్తూ ప్రకాశరావు గురించి ఆలోచిస్తూంటే శాంతమ్మ నెమ్మదిగా నీరజ ప్రక్కన వచ్చికూర్చుంది. తల్లినిచూచి లేచి కూర్చుంది నీరజ.

''గిరిజ నీకేమీ చెప్పలేదా నీరజా!''అడిగిందామె.

''చెప్పిందమ్మ'' అంది నీరజ తలవంచుకుని.

''మరి నీవే మంటావమ్మా! రెండోపెళ్ళి అన్నమాట తప్ప మరిలోపమేమిటి? నీకు అతను తెలుసును. అతనికి నీవు తెలుసును. కానికులం కాదు. మంచిసాంప్రదాయం. అతని వెనుక మంచి చెడ్డా చూచేందుకు అతనివాళ్ళున్నారు. మంచివాడు. నీవు సామ్ముందుంటావు. నీవు ఉద్యోగంచేసినా అతనుకాదనడు. అతనికీ బరువుబాధ్యతలులేవు. నీవు ఈ కుటుంబాన్ని ఆదుకోవటం అవుతుంది. నీపెళ్ళి అయినట్టు ఉంటుంది. పెళ్ళికాని పిల్లను ఎంతకాలం గుండెలమీద కుంపటిలా ఉంచుకోమంటావు నీరజా! నీపెళ్ళయితే మీఅన్నకేదైనా ఉద్యోగం దొరుకుతుంది. ''ఊ అను నీరజా!'' అందామె.

''నన్ను ఆలోచించుకోనియ్యమ్మా'' అంది నీరజ.

''ఇందులో ఆలోచించుకోటానికేముంది నీరజా! ఒకమాట స్పష్టంగా చెప్తున్నాను. చంద్రంగారికి మేము పైసా కట్నంకూడ ఈయనవసరంలేదు. ఇది తప్పితే కట్నాలు పోసి నీకు పెళ్ళిచేయటం మా తలకు మించిన పని. నీకు పెళ్ళి కాకపోతే గిరిజ, పార్వతీ అలాగే ఉండక తప్పదు. లేనిపోని భ్రాంతికి పోయి వచ్చిన అవకాశాన్ని కాలదన్నుకోకు

దుర్వాసనే
ఎడబాటుకు కారణం...

కాల్గేట్ డెంటల్ క్రీమ్‌తో నోటి దుర్వాసనను ఆపండి... రోజంతా దంతక్షయాన్ని నివారించండి!

కాల్గేట్ 10 మందిలో 7 గురికి వెంటనే నోటి దుర్వాసనను నివారించినదని, భోజనము అయిన వెంటనే కాల్గేట్ పద్ధతిలో పళ్లు తోముకొంటే ఎక్కువ దంత క్షయమును, ఎక్కువ మందికి అరికట్టినదని దంతశాస్త్ర చరిత్రలో పూర్వము ఎప్పుడూ ప్రకటింపబడనట్లు శాస్త్ర పరీక్షలు నిరూపించేయి. ఎందుకంటే: కాల్గేట్ డెంటల్ క్రీమ్‌తో ఒకసారి పళ్లు తోముకొంటేనే 85% వరకు నోటి దుర్వాసన మరియు దంతక్షయమును కలిగించే సూక్ష్మ క్రిములు పోతాయి.

ఎంత చక్కని పెప్పర్‌మెంట్ రుచి కూడ ఉంది—కాల్గేట్ డెంటల్ క్రీమ్‌తో రోజూ పళ్లు తోముకొనుటకు పిల్లలు యిష్టపడతారు!

శుభ్రమైన, తాజా శ్వాసకు మరియు
తెల్లగా మెరిసే పళ్లకు...కాల్గేట్ కొనండి

DC.G.57 TL

నీరజా. బాగా ఆలోచించు" అని చెప్పి వెళ్ళిపోయిందామె.

చంద్రంగార్ని పెళ్ళిచేసికుని అతనికి సేవలు చేస్తూ, పిల్లల్నికంటూ, పుట్టింటికోసం ఉద్యోగంచేస్తూ జీవితాన్ని గడపవలసి ఉన్నదన్న సత్యం స్పష్టపడగానే "భగవాన్! రెండు

రా జీ నా మా

ప్రక్కలా నే నలిగిపోలేను. నాకీ పెళ్ళివద్దు. ఈ పెళ్ళి నెలాగైనా తప్పించు" అని దేవుడికి మొక్కుకుంది నీరజ.

* * *

నీరజ యాంత్రికంగా టైప్ చేస్తునే ఉంది. కాని మనసు మాత్రం గడియారంమీదే ఉంది. బరువుగా "లంచ్ బ్రేక్" వచ్చింది. యధావిధిగా పలకరించవచ్చాడు ప్రకాశరావు. "సాయంత్రం మీతో ఒకముఖ్యమైనవిషయం మాటాడాలి. నాకోసం ఆగుతారుకదూ" అడిగింది నీరజ.

"అలాగే. ఇంతకీ ఏమిటా ముఖ్యమైన విషయం?" అడిగాడు ఆత్రుత నాపుకోలేక

"చెప్తాను"అంది నీరజ. ప్రకాశరావు ఊహాగానాలు చేస్తూ వెళ్ళిపోయాడు.అప్పటినుండి ఆఫీసు టైమయ్యేంతవరకు అసహనంగా తనవైపు ప్రకాశరావు చూడటం నీరజ గమనిస్తూనే ఉంది.

ఆఫీసునుండి వచ్చేస్తూంటే నెమ్మదిగా ఫాలో అయ్యాడు ప్రకాశరావు.

"ఎక్కడైనా కూర్చుందాం" అంది నీరజ. ఇద్దరూ వెళ్ళి హోటల్లో ఒక మూల కూర్చున్నారు. నీరజ తానేమీ తీసికోనంది. ప్రకాశరావు రెండుకాఫీకి ఆర్డరిచ్చాడు. కాఫీ తీసుకుంటూ తనకేర్పడిన పరిస్థితిని నెమ్మదిగా చెప్పింది నీరజ" ఈ పెళ్ళిని ఎలా తప్పించుకోవాలో నాకు తెలియటంలేదు." అంటూ ఆగిపోయింది.

ప్రకాశరావు దీర్ఘంగా ఆలోచించాడు "మనసంగతి మీయింటిలో తెలియదా?" అడిగాడు. 'తెలియదు' తలవంచుకునే సమాధానమిచ్చింది నీరజ.

"చెప్పేసెయి. ఒక సంవత్సరం తరువాత మనపెళ్ళికూడ అవుతుందని చెప్పేయి."

"చెప్తాను. గాని ఒప్పించలేను. ఇంట్లో అంగీకరిస్తారన్న నమ్మకంలేదు"

"అయితే నేనేవచ్చి చెప్తాను." అన్నాడు దృఢంగా.

"మీరా!" అంది తలెత్తి నీరజ

"అవును. ఎప్పుడైనా చెప్పవలసినదేగా నిన్ను నేను రహస్యంగా పెళ్ళి చేసికోబోవటం లేదుగా."

"మనపెళ్ళికి అంగీకరించకపోతే......"

"ఇక నీవు నాకోసం వేచి ఉండనవసరం లేదు. చంద్రంగార్ని పెళ్ళిచేసికో"

నీరజ కొద్దిసేపు అతని కళ్ళలోకే చూచింది.

"నీ చూపు నాకర్థమైంది. ఇరువైపులా ఏ పక్షంవారు పెళ్ళికి యిష్టపడకపోయినట్లయినా ఆపెళ్ళి జరిగినా సుఖంలేదు. నీవు

మీరు బలహీనంగా ఉన్నప్పుడు
దగ్గు, జలుబు విడవకుండా
పీడిస్తూనే ఉంటాయి.



నియమానుసారంగా వాటర్ బరీస్
కాంపౌండ్ రెడ్ లేబుల్ తీసుకుంటే
అది రోగనిరోధకశక్తిని పెంపొందిస్తూనే
ఉపశమనాన్ని కూడా
కలిగిస్తుంది.

- దీనిలో క్రియొసైట్, గైకాల్ ఉన్నందు వల్ల నిలిచే ఉపశమనం కలుగుతుంది.
- అంతేగాకుండా, చాలాకాలం రోగనిరోధక శక్తిని పెంపొందించేందుకు, దీనిలో అదనంగా ప్రత్యేకమైన టానిక్ పదార్థాలు ఎన్నో ఉన్నాయి.
- విడవకుండా పీడించే దగ్గు, తిరిగి తిరిగి వచ్చే జలుబును అరికడుతుంది.
- ఆరోగ్యాన్ని, బలాన్ని తిరిగి కలిగిస్తుంది.

దగ్గుకు,
జలుబుకు
అత్యంత
నమ్మకమైన
చికిత్స



వార్నర్
హిందుస్థాన్ వారి
విశిష్ట ఉత్పాదన

వాటర్‌బరీస్ కాంపౌండ్
రెడ్ లేబుల్

WH.9028

మాయింటిలో అందరికి సమ్మతమైనావు. నేనుకూడ మీవైపువారిచేత యిష్టపడినపుడే మనది ఆనందకరమైన జీవితం. కాని నాడు అది శాపగస్తం" అన్నాడు ప్రకాశరావు.

నీరజ కళ్లలో కన్నీరుబికింది.

"అధైర్యపడకు నీరజా! అందరినీ ఒప్పించే పూచీ నాది. ఒప్పించగలననే ధైర్యముంది. మరి ఎందుకా కన్నీరు?" అన్నాడు.

నీరజ నెమ్మదిగా కన్నీరు తుడుచుకుంటూ "అర్థమైంది. మన పెళ్ళి మరి జరగదు" అంది.

"జరుగుతుంది నీరజా! నేను ఒప్పిస్తాగా"

"అది జరగనిపని. మన పెళ్ళి మరి జరగదు. మీరు మాయింటికి రాకండి. మీరు అవమానపడటం నేను సహించలేను"

"నీరజా!"

"అవును. మీకుదయవుంటే ఎప్పుడైన నన్ను తలుచుకోండి. పదండి వెళ్దాం" అంది నీరజ

నీరజ మనోగతాన్ని ఊహిస్తూ నెమ్మదిగా లేచాడు ప్రకాశరావు.

తన ఇంటికి రావద్దని నీరజ హెచ్చరించినప్పటికి మర్నాడు ఉదయం ప్రకాశరావు నీరజ ఇంటికి వెళ్ళాడు. నీరజను తాను యిష్టపడి పెళ్ళిచేసికోదలచిన విషయాన్ని తెలియజేశాడు ఆమె తండ్రితో. అతను నాదన కేమాత్రం అవకాశాన్నివ్వక "కులం తక్కువ వివాహాలు మావంశంలో లేవు. ప్రేమ వివాహాల మీద నాకు నమ్మకంలేదు. అయినా నీరజ పెళ్ళి నిశ్చయమైంది. ఇక వెనుకకుపోవటం జరగదు." అన్నాడు నీరజతండ్రి.

ప్రకాశరావు వాదించటానికి ప్రయత్నించాడు. కాని ఫలితం లేకపోయింది. ప్రకాశరావు ఖిన్నుడై వచ్చేశాడు.

నీరజ పెళ్ళి పదిహేను దినాలకే అయిపోయింది.

* * *

'ఈనెల పూర్తయిపోగానే ఉద్యోగానికిరాజీనామా చేదామనుకుంటున్నాను' అని చెప్పేసింది నీరజ, చంద్రశేఖర్‌తో మొదటి రోజు రాత్రి. అంతవరకు కుటుంబం కోసం శ్రమపడి ఆదుకోవాలనుకున్న నీరజ, ప్రకాశరావుతో తనవివాహం జరగకపోవటంతో మానసికంగా దెబ్బతిన్నది. పెళ్ళి తప్పించిన తనవారికోసం తానెందుకు శ్రమపడాలనే తిరుగుబాటుతనం ఆమెలో పెల్లుబికింది.

అందుచేతనే ఆమె ఈ నిర్ణయం చేసికుంది.

"నీవు ఉద్యోగం మానేస్తే మీవాళ్ళేమనుకుంటారు. నేను మాన్పించాననుకోరు? మీ అన్న సూర్యం ఉద్యోగం దొరికేంతవరకు నీవు ఉద్యోగం చేస్తావని మాటయిచ్చాను." అన్నాడు చంద్రశేఖరం.

"పెళ్ళి చేసికున్న తరువాతకూడా నేను ఉద్యోగం చేయవలసి వస్తుందని నాకు ఎవరూ చెప్పలేదు."

"కాని ఆ షరతుమీదే నిన్ను నాకివ్వటానికి మీ వాళ్లు ఒప్పుకున్నారు. నేను అంగీకరించక తప్పలేదు."

"మీరెందు కొప్పుకున్నారు? నేను కాకపోతే మీకెవరూ దొరకరా?"

"నేనెవర్ని చేసికున్నా ఈప్రశ్న అడగక తప్పరు. ఎవరికైనా నేనుమాత్రం ఏమని చెప్తాను? ఎవరో అన్నారు 'ఆ అమ్మాయినెందుకు పెళ్ళిచేసికోకూడదూ? అని. అవును ఎందుకు చేసికోకూడదూ?' అని నేననుకున్నాను. రాయబారాలు నడిచాయి. పెళ్ళిఅయింది" అన్నాడు.

నీరజ మాటాడకుండ మిన్నకుండిపోయింది.

"మాటాడవేం? మరేమి ప్రశ్నలు లేవా?"

"ఇప్పటికింతే" అంది నెమ్మదిగా.

"రెండో పెళ్ళివాడు భర్తయినాడని బాధపడుతున్నావుకదూ?"

"ఛ! లేదు. నేనెప్పుడూ అలా అనుకోలేదు."

"నీరజా! రాధపోయిన తరువాత పెళ్ళి చేసికోకూడదనే అనుకున్నాను. నిర్మలను ఎవరికైనా పెంచుకోటానికి యిచ్చి ఒంటరిగానే జీవితం గడిపేద్దామనుకున్నాను. కాని నేను ఒంటరిగా ఉండటం నాతరపు ఎవ్వరూ ఇష్టపడలేదు. అందరి బలవంతమే ఈ పెళ్ళికి దారితీసింది. కొందరు స్నేహితులు "ఒక స్త్రీ జీవితాన్ని ఎందుకు ఉద్ధరించకూడదూ?" అని హితబోధచేసారు. కాని నిన్ను పెళ్ళిచేసికోటంలో నేను ఏదో గొప్పవిషయాన్ని చేశానని అంగీకరించను. నేను మీనాన్నగారిదగ్గర కట్నం తీసికోలేదు. అలానే రాధ తండ్రిగారిదగ్గరకూడ తీసికోలేదు. మీఅన్నకు ఉద్యోగం దొరకగానే రేపు ఉద్యోగం మానేయవచ్చు. నిన్ను సుఖపెట్టటమే నా ధర్మం."

అతను మాటాడుతూంటే నీరజకు మాటలురాలేదు.

"నేను ఈపెళ్ళి చేసికోవటం తప్పనిసరే నీరజా! నేను బరువైన ఆలోచనను భరించలేను. తీవ్రంగా ఆలోచించిననాడు గుండెలో విపరీతమైన పోటువస్తుంది. చచ్చిపోతానేమో అని భయమేస్తుంది. కాని విశ్రాంతి తీసికుంటే తగ్గిపోతుంది. రాధ పోయినతరువాత ఈగుండెనొప్పి మరీ ఎక్కువైంది. రాధనుండి ఆలోచనలు మరలించుకోవటంకోసం, నిర్మలను చూడటంకోసం నేనీపెళ్ళిచేసికున్నాను ఇక నాకేభయంలేదు నీరజ నాదగ్గర ఉన్నంతకాలం అవునా?" అన్నాడు ఆమె చేతిని తనచేతిలోకి తీసికుంటూ.

"అవును మీకేం భయం లేదు!" అంది నీరజ.

* * *

ట్రైన్ ముందుకు కదులుతోంది వెన్నెల్లో.

నీరజ కిటికీదగ్గరకూర్చుని వెన్నెలలోకే చూస్తోంది. ఆమె దృష్టిమాత్రం వెన్నెల్లో జరిగే దృశ్యాలమీదలేదు ఆమెఒడిలోకూర్చున్న మేడాదిబాబు లేచిలేచిబడి కిటికీలోంచి తొంగి చూడాలని ప్రయత్నిస్తూంటే బాబును పట్టుకుంటూ వెన్నెల్లోకే చూస్తోంది, ఆమె ప్రక్కన కూర్చున్న అయిదేళ్ళ నిర్మల బొమ్మల

పుస్తకాన్ని తదేకంగా చూస్తోంది. చంద్రశేఖరం వెన్నెల్లోకి చూస్తున్న నీరజనే చూస్తున్నాడు. అతను తన్నే చూస్తున్నాడని ఆమెకు తెలుసు గాని అతనివైపు తిరిగి చూడటంలేదు. ఆమె మౌనాన్ని భగ్నంచేసి ఆమెనెలా మాటాడించటమో అర్థంకావటం లేదు. అతను ముందుకు వంగాడు. బాబును చేతిలోకి తీసికొన్నాడు. నీరజ తిరిగిచూచింది.

"నీరజా ! నామీద నీకు కోపంపోలేదు కదూ !" అన్నాడు.

"మీమీద కోపం నాకెందుకు ?" అంది నీరజ.

"కోపం కాకపోతే బయలుదేరిన దగ్గర నుండి నీవెందుకంత నిర్లిప్తంగా ఉన్నావు."

"మనిద్దరి ట్రాన్స్‌ఫర్ విషయం చివరి వరకూ నానుండి మీరు చాల రహస్యంగా ఉంచారు. అందుకు బాధగాఉంది. కోపం నాకెందుకు?" అంది తలవంచుకునే.

"నేను ట్రాన్స్‌ఫర్‌కోసం ప్రయత్నిస్తున్నానని నీకు తెలిస్తే నీవు నాప్రయత్నాన్ని సాగనివ్వవని నాకు తెలుసు."

నీరజ మాటాడలేదు.

"సహనానికికూడ ఒక హద్దుంది నీరజా ! మనషులు మనుషులే! కాని యంత్రాలుకారు. కాలేరు. మన పెళ్లయిన తరువాత నీచేత ఉద్యోగం చేయించానేకదా ! ఉద్యోగం మానేస్తానన్న నీవు ఉద్యోగం చేస్తానంటే నే కాదన లేదుగా. మీ అన్నకు ఉద్యోగం వేయించే మావగారు దొరికారు. ఉద్యోగం అయింది. పెళ్లి అయింది. 'అన్నయ్యది కొత్త సంసారం నీవు ఉద్యోగం మానేస్తే ఎలా?' అని మీఅమ్మగారన్నదంటే నీయిష్టప్రకారమే కానివ్వ

రాజీనామా

లేదూ: పెళ్ళయిన ఆరునెలలకే మీ అన్నయ్య వేరేకాపురం పెట్టుకుని వెళ్ళిపోతే ఉద్యోగం చేయటం అనివార్యమైతే నే కాదనలేదుగా. మీతమ్ముడి చదువుపూర్తయింది. అతనూ ఉద్యోగం సంపాదించుకున్నాడు. అతను తెచ్చే జీతంతో సంసారం నడవకపోదు. ఇక నీవు ఉద్యోగం చేయటం అనవసరం. కాని మీవాళ్ళ నీముందు కనిపిస్తూఉంటే నీవు ఉద్యోగం మానవు. అందుకే ఈ ప్రయత్నం చేశాను. మనం హైదరాబాద్ చేరినతరువాత నీవు ఉద్యోగం మానేయటం తథ్యం."

అతనివైపే చూస్తున్న నీరజ "మీ రెప్పుడు మాటాడినా ఎదుటివారిని మాటాడలేని పరిస్థితిలోనే పెడతారు" అంది.

"నేను నిజం చెప్పాను. ఏఒక్కటీ కల్పించి చెప్పలేదుగా. నీమంచితనాన్ని ఒక్కనాడూ వాళ్ళు గుర్తించలేదు. అదే నాబాధ. జీత మంతా ఇంటికోసమే యిచ్చేశావు. అది నీమంచితనంగా వారికి తోచలేదు. సంపాదించి యివ్వటం ఒకహక్కుగా భావించారు. నీరజా ! ఒక్కమాట. మనంఏచెట్టు నీడన ఆశయం పొంది, ఏచెట్టు ఫలపుష్పాలను పొందుతున్నామో ఆ చెట్టును రక్షించుకునేబాధ్యత, సంరక్షించుకునే బాధ్యత మనమీదుంది. కాని రెమ్మలను త్రుంచి కొమ్మలనుకొట్టే నంటబెలుకుగావాడే మనఃతత్వం నేనునచ్చను. ఎబార్షనై నీవు సెలవలోఉంటే అనారోగ్యం చేత ఉద్యోగం మానేస్తావేమో అనే భయపడ్డారేగాని నీ ఆరోగ్యంకోసం ఆందోళనపడలేదు. ఆ పరిస్థితిలోకూడ నీవు జీతంమీఅమ్మ చేతికిస్తే 'టానిక్కుకొనుక్కోమని' ఒక పది రూపాయలు నీ చేతిలో పెట్టలేదు. సుమారు రెండు సంవత్సరాలు నా ఆరోగ్యం బాగోక కొన్ని రోజులు, బాబు పుట్టినప్పుడు మనం ఎన్ని ఇబ్బందులలో పడ్డాము. కాని వాళ్ళేమీ లోటు చెయ్యలేదు. కాని ప్రతిఫలం ఏమిటి? ఎరియర్సుగా వచ్చిన అయిదువందల రూపాయలు తన జేబులో సొమ్ములాగ, మనకేదో అప్పు ఇచ్చినవాడిలా అడగలేదూ మీనాన్న? మనమింకా ఏ నిర్ణయం చేసికోందే మర్నాటి పుదయం కాబూలీవాడిలా వచ్చి కుర్చీలో కూర్చోలేదూ? మనం ఆ డబ్బు విషయమై ఏమీ మాటాడలేదనేకదా వారం రోజులు ముఖం చూపించలేదు. ఎదుటపడినా పలకరించలేదు. అంటే అక్కడికి, వాళ్ళు పలకరించటమే మహోపకారంగా నీవు భావించాలన్నమాట. అంతేకదూ. ఆనాడు నా చేతి కిచ్చిన సొమ్ము గురించి ఇంతవరకూ ఏనాడు అడగలేదు. కాని ఎప్పుడో ఒకప్పుడు చెప్పాలి కాబట్టి చెప్తున్నాను. ఆ అయిదు వందలు గిరిజకోసం ఫిక్సెడ్ డిపాజిట్‌లో వుంచాను. గిరిజ పెళ్ళి ఎప్పుడయితే అప్పుడు వడ్డీతో సహా నీవే గిరిజకు అందచేద్దువుగాని." ఆగాడు చంద్రశేఖరం.

నీరజ కళ్లల్లో నీళ్ళు తిరిగాయి. మాటాడలేకపోయింది.

"నీరజా! నీవు నన్ను పెళ్ళిచేసుకుని ఏమీ సుఖపడలేదు. కాని ఎవరికీ ఏ లోపం రానీయలేదు నీవు. ఇంతవరకూ ఏమీ చేయడానికి నాకు అవకాశం రాలేదు. ఇప్పుడు అవకాశం ఏర్పడింది. ఆ లోటేలోపం చెయ్యను" అన్నాడు.

కొన్నినిముషాలు మౌనంగా వుండి తలఎత్తి అతనివైపు చూచి, అతను ప్రశాంతంగా ఉండటం కనిపెట్టి "నేనొక మాట చెప్తాను కోపగించరుగ" అంది నెమ్మదిగా.

అతను నెమ్మదిగా తల పంకించి "ఉద్యోగం చేస్తాననే అంటావు. అంతే కదూ!" అన్నాడు.

"అవును. గిరిజ, పార్వతి అమాయకపు పిల్లలు. వాళ్ళ గురించి పట్టించుకునే వాళ్ళెవరూ లేరు. మనం కూడా వదిలేస్తే వాళ్ళ గతి ఏమిటి ? వాళ్ళకోసమే ఇంతకాలం ఎన్ని బాధలైనా, కష్టాలైనా సహించాను. గిరిజ పెళ్లయితే చాలు, గిరిజ పార్వతి గురించి



ఆలోచించగలదు. అంతవరకు ఉద్యోగం చేయనివ్వండి ''

అతను సన్నగా నవ్వాడు.

''నీవీ మాట అంటావని భయపడుతూనే ఉన్నాను నీరజా!...''

''కానీ మీరెలాగైనా ఒప్పుకుంటారని నాకు నమ్మకముంది. గిరిజ ఎంత మంచి పిల్లో మీకు తెలియదూ? నా ఆరోగ్యం బాగా లేనప్పుడు అమ్మా, నాన్నకు తెలియకుండా రహస్యంగా వచ్చి నన్ను చూచి ఇంట్లో కావలసిన నాలుగు కనుక్కొని, అమర్చిపెట్టి వెళ్ళేది కాదూ? మీరే చెప్పండి; నేనంటే దానికెంత అభిమానమో!''

''నీవు ఉద్యోగం చేసినంత మాత్రాన గిరిజ పెళ్ళి కాదు. నీవు యింటికి డబ్బు పంపిస్తే అది గిరిజకుపయోగపడదు. అంటే గిరిజకోసం నీవు ప్రత్యేకంగా బ్యాంకులో వెయ్యాలి. నీవు ఉద్యోగంచేస్తూ డబ్బు తమకివ్వడంలేదని మీ ఇంటిలో తెలిస్తే వారితో నీకు వైరం తప్పదు. వాళ్లతో నీకు వైరం కావాలంటే నీ యిష్టమే కానియ్యి.''

''నాకు ఈ మనుషుల తత్వం బాగా తెలుసు. తొంభయి తొమ్మిదిసార్లు ఉపకారం చేసి నూరవసారి ఏ కారణంచేతనైనా ఉపకారం చేయకపోతే వైరంకొని తెచ్చుకునే రకమే వీళ్ళు. మంచి చేసేవారు ఎప్పుడో ఒకప్పుడు వీళ్లకు శత్రువులుకాక తప్పరు. అలాంటి వాళ్లచేత మంచి అనిపించుకోవడం కూడ నాకు యిష్టంలేదు. వారేమనుకున్నా నే బాధపడను. ఎప్పుడూలేని ఆదరణ, పిలుపులు యిప్పుడు లేవని బాధపడను గిరిజ సుఖపడ్డం నాకు కావాలి. అందుకు మీ సహకారం కావాలి. అంతే.'' అంది నీరజ.

''ఇవ్వాళ గిరిజ, రేపు పార్వతి, ఇంకో రోజు ఇంకోటి. గిరిజలో మంచితనం కొంతే ఉండవచ్చు. కాని నీవు మంచి మనసులోనే చూస్తున్నావు. అందుకనే గిరిజ నీకు ఎంతో మంచిగా కనపిస్తోంది. నీవు ఆర్ద్ర హృదయంతో ఉన్నంతకాలం నీవు ఉద్యోగానికి రాజీనామా యివ్వలేవు. ఇది నేను చెప్పిన మాట. అయితే నా మాటలు నీకు నచ్చవు. కాలమే నీకు తెలియజేస్తుంది. నీ ఇష్టమేకానియ్యి'' అన్నాడు.

నీరజ కొద్దిసేపు మౌనంగా వుండి ''కోపం వచ్చిందా?'' అడిగింది.

''లేదు. నిన్ను సుఖపెట్టలేకపోతున్నాను కదా అని బాధగా ఉంది అంతే'' అన్నాడు.

''ఇప్పుడు నేను సుఖపడటంలేదని మీరెందుకనుకోవాలి? కష్టపడటంలోనే కొందరికి సుఖముంటుంది'' అంది నీరజ.

''అలా చెప్పకునే నేను మనసు సరిపెట్టుకోవాలి''

ట్రైన్ ఆగింది.

''ఏమైనా కావాలా?'' అడిగాడు.

''మంచినీళ్ళు పట్టండి'' అంటూ వాటర్ బాటిల్ అందించింది నీరజ

చంద్రశేఖరం నీళ్లకోసం వెళ్లిపోయాడు

నిద్రపోవటానికి ఒకప్రక్కకు ఒరుగుతున్న నిర్మలను పడుకోపెడుతున్న నీరజ పైబెర్తునుండి క్రిందికి దిగుతున్న వ్యక్తిని చూచి ఆశ్చర్యపోయింది.

''ప్రకాశంగారూ! మీరా!! ఎంత కాలానికి?'' అంది అప్రయత్నంగా.

''నేనే నీరజా! మీరు ట్రైన్ ఎక్కటం చూచినప్పుడే పలుకరించా లనుకున్నాను. కాని

దీపావళి కథలపై
బ్యాలట్ గడువు
20-11-'76తో
ముగుస్తుంది

మీరు సంభాషణలో పడ్డారు. మీ సంభాషణను భగ్నపరచలేక పోయాను. మీ మాటలన్నీ విన్నాను. అతను చెప్పిన మాటల్లో ఎంతో సత్యం నాకు కనిపించింది. ఎదుటిమనిషిలో ఉన్నది కొంత మంచి అయినా మన మనసు మంచిదైనప్పుడు అంతా మంచిగానే కనిపిస్తుంది. అలాంటి మనసుండటం చేతనే సుఖంలేక పోతున్నది...... ఆ!... మీపిల్లలా ...ఇద్దరేనా?...నీ పెళ్ళయి నాలుగేళ్ళయింది కదూ!'' నిర్మలవైపు బాబువైపుచూస్తూ

''పెళ్ళయి ఐదేళ్ళయింది ఈ బాబు నా సంతానం. నిర్మలను మా పెళ్ళికి చూశారుగా'' ''అవును మీరిప్పుడెక్కడికి వెళ్తున్నారు?''

''హైదరాబాద్! మీరు నాపెళ్లయిన సంవత్సరమే బెజవాడ వెళిపోయారు. ఇప్పుడు ఎక్కడ పనిచేస్తున్నారు?''

''ఇప్పుడు గుంటూరులో. ఒక స్నేహితుని కలియటం కోసం ఇటువైపు వచ్చాను. ఎలాగా ఇటు వచ్చానుకదా అని మాతమ్ముడు పనిచేస్తున్న ఈ ఊరిలో దిగబోతున్నాను. నీవు మాత్రం చాల చిక్కిపోయావు. మీ ఆయన చెప్పినట్టు కాకపోయినా కొంత కాలమైన సెలవుపెట్టి విశ్రాంతి తీసుకోకూడదూ!''

''మనసును బాధపెట్టే ఆలోచనలే మనసులో తిరుగుతున్నంతసేపూ విశ్రాంతిలో హాయిలేదు ప్రకాశరావుగారూ? నాకు చేతినిండా పనివుంటేనే మానసిక విశ్రాంతి.''

''మీ యింటి ఆలోచనలే నిన్ను బాధపెడుతున్నాయి కదూ?''

''లేదు డబ్బుతెచ్చి నాన్నచేతిలో పోయటం తప్ప నేను వాళ్ళ ప్రవర్తన గురించి ఏనాడూ పట్టించుకోలేదు.''

''చంద్రంగారు మంచివారేనే? మరి నీమనసును బాధపెట్టే ఆలోచనలేమిటి?

''ఎందుకా హృదయపరీక్ష?''

''నీ స్నేహితుడిగా నేనామాత్రం తెలిపికోకూడదా?''

''తెలిసికున్నా ఇప్పుడు మీరు మాత్రం ఏం చేయగలరు?''

ప్రకాశరావు కొద్దిసేపు మౌనంగా ఉండి ''కోరుకున్నదేదో అందలేదన్న బాధతో మనసు పాడుచేసి కుంటున్నావేమో. అదే నిజమైతే అది చాల తప్పని చెప్పాలనే నా ఉద్దేశ్యం. నీవు అదృష్టవంతురాలివి నీరజా! నీవు నాకోసం వేచివుండకపోవటమే మంచిదైంది. నేను బాధ్యతలకు రాజీనామా నివ్వలేక పోతున్నాను. నీవు ఉద్యోగానికి రాజీనామా నివ్వలేక పోతున్నావు. మనిద్దరివీ ఒకే రకం కథలు. కొద్దిమార్పులంతే. నిన్ను మనుషుల చెడ్డతనం బాధిస్తుంటే నన్ను మనుషుల మంచితనం బాధిస్తున్నది. నాగురించి చెప్పుకునే వ్యవధిలేదు. నీవు మాత్రం గిరిజ పెళ్లయిపోయిన తర్వాతనైనా ఉద్యోగానికి రాజీనామా చెయ్యి. వస్తాను. మళ్లా ఎప్పుడైనా ఎక్కడైనా కలుద్దాం'' అంటూ ఎయిర్ బ్యాగ్ అందుకుని ద్వారం వైపు నడిచాడు ప్రకాశరావు.

ప్లాట్‌ఫారంమీద త్వరగా నడుచుకుంటు ముందుకు పోతున్న ప్రకాశరావును చూస్తూ కళ్లల్లో నిలిచిన కన్నీళ్లను తుడుచుకుంది నీరజ.